

# తెలుగు సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

**నేడు సద్దుల బతుకమ్మ**
- గంగమ్మ చెంతకు చేరనున్న బతుకమ్మలు
- కొత్తగూడెంలో ముర్రేడు, గోధుమవాగు ఇల్లెందులో పెద్దమ్మ గుడి చెరువు వద్ద ఘాట్లు



కొత్తగూడెం సూపర్‌బజార్‌లో ఫుట్‌పాత్‌పై పూలు అమ్ముతున్న చిరువ్యాపారులు

**కొత్తగూడెంటౌన్/ఇల్లెందు:** జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకునేందుకు మహిళలు సిద్ధమయ్యారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ముర్రేడు వాగు, రామవరంలోని బతుకమ్మ ఘాట్, ఇల్లెందులోని గుండాల రోడ్‌లో పెద్దమ్మ గుడి చెరువు కట్ట వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలు, నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 21న పెత్రామావాస్య నుంచి ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు 29 తేదీన సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. సద్దుల బతుకమ్మ రోజు ఆడపడుచులు పోటీలు పడి బతుకమ్మలను అందంగా పేర్చుతారు. బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి కొత్త దుస్తులు ధరించి ఆనందంగా ఆడిపాడతారు.

సద్దుల బతుకమ్మపై పసుపు గౌరమ్మను పెట్టుకుని చెరువు ఒడ్డుకు వెళ్లి వెంపలిచెట్టును మధ్యలో పాతి చుట్టూ బతుకమ్మలను పెట్టుకుని ఆటపాటతో హోరెత్తిస్తారు. అనంతరం ఘాట్ వద్దకు చేరుకుని బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం గోధుమవాగు, పాలకేంద్రంలోని ముర్రేడువాగు, రుద్రంపూర్ ధన్‌బాద్ చెరువు, సుజాతనగర్, జూలురుపాడులలోని చెరువులు, వాగుల్లో బతుకమ్మలను గంగమ్మ చెంతకు తీసుకొచ్చి నిమజ్జనం చేస్తారు.

**సద్దుల బతుకమ్మ అంటే..**

పొలంలో పని చేస్తున్న బంధువుల కోసం లేదా ప్రయాణంలో ఉన్న బంధువుల కోసం సిద్ధం చేసే టిఫిన్ క్యారియర్‌లా, పూర్వకాలంలో బంధువులను సాగనంపుతున్నప్పుడు కూడా చాలాదూరం నడవాల్సి వస్తుంది కాబట్టి సద్దులను కట్టి పంపేవారు. వారితో పాటు పొలిమేర వరకు సాగనంపే ఆచారం ఉండేది. బతుకమ్మను కూడా ఇలాగే సద్దులు కట్టి ఊరి పొలిమేర వరకు సాగనంపడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సద్దుల పేరు మీదనే చివరిరోజు జరుపుకునే పెద్ద బతుకమ్మ పండుగను సద్దుల బతుకమ్మ అని పిలవడం జరుపుతుందని వేదపండితులు చెబుతున్నారు.

**పూలకు గిరాకీ..**

తెలంగాణలో బతుకమ్మ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉంది. సోమవారం సద్దుల బతుకమ్మ కావడంతో ఎవరికివారు అందమైన పెద్దపెద్ద బతుకమ్మలను పేర్చి అందంగా తీర్చిదిద్దడానికి పూలను సేకరిస్తారు. కొందరు పూలను కొనుగోలు చేసేందుకు తరలిరావడంతో ఆదివారం కొత్తగూడెంలోని సూపర్‌బజార్‌లో సందడి వాతావరణం నెలకొంది. కొత్తగూడెం సూపర్ బజార్ సెంటర్‌లోని రోడ్డుకు ఇరువైపుల రైల్వేస్టేషన్ వరకు దాదాపుగా 100కు పైగా పూల వ్యాపారులు ఫుట్‌పాత్, రోడ్డుకి ఇరువైపుల అమ్మకాలు చేస్తున్నారు. ఇల్లెందులోని గుండాల రోడ్‌లో పెద్దమ్మ గుడి చెరువు కట్ట వద్ద ఘాట్ వద్ద స్టేజీ నిర్మాణం చేశారు. ఏర్పాట్లను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరిశీలించారు.



బతుకమ్మ ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**పూల గిరాకీ బాగుంది..**



సద్దుల బతుకమ్మ కావడంతో మాకు అమ్మకాలు బాగున్నాయి. ఏటా ప్రతీ పండుగకు ఇక్కడకు వచ్చి పూలు అమ్ముతుంటాం. మాకు అన్ని ఖర్చులు పోను మాకు రోజుకు రూ.1000 వరకు మిగులుబాటు అవుతుంది. పూలను కొనేందుకు ఎక్కువ మంది వస్తుండటంతో గిరాకీ బాగుంది.

– ప్రసాద్, చిరువ్యాపారి, రాఘవాపురం

**ప్రతీ పండుగకు పూలు అమ్ముతా..**



సద్దుల బతుకమ్మ కావడంతో పూలను బండి మీద తీసుకొచ్చి అమ్ముతున్నా. ప్రతీ ఏడాది ప్రతీ పండుగకు ఇల్లెందు నుంచి ఇక్కడకు వచ్చి పూలు అమ్ముతా. అన్ని ఖర్చులు పోను నాకు రూ.3 వేల వరకు మిగులుబాటు అవుతుంది. పూలకు ఇక్కడ గిరాకీ బాగుంటుంది.

– బాబూరావు, పూలవ్యాపారి, ఇల్లెందు

**నేడు సద్దుల బతుకమ్మ..**



తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతీక ప్రకృతిలోని పూలను బతుకమ్మగా పేర్చి ఆడపడుచులు ఆటపాటలతో పూజిస్తారు. బతుకమ్మ ఆడుతూ అందరు సంబురాలు జరుపుకుంటారు. ఈసారి సద్దుల బతుకమ్మను 29వ తేదీన తొమ్మిదవ రోజు జరుపుకుంటారు.

– దత్తాత్రేయశర్మ, వేదపండితులు, కొత్తగూడెం







కొత్తగూడెంలో వివిధ ఏరియాల్లోని మార్కెట్లలో అమ్మకానికి ఉంచిన పూలు

## చాముండేశ్వరీ దేవిగా దుర్గామాత



ఇల్లెందు: చాముండేశ్వరీ దేవీగా దుర్గామాత

**ఇల్లెందు:** పట్టణంలోని నంబర్–2 బస్తీ రామాలయంలో ఆదివారం దుర్గామాత అమ్మవారు చాముండేశ్వరీ అవతారంలో దర్శనం ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**ఇల్లెందురూరల్:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారు చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని సుభాష్‌నగర్ రామాలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే కోరం కనకయ్య దర్శించుకొని ప్రత్యేక పూజ చేశారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని కుంకుమ పూజ చేశారు.

**జూలూరుపాడు:** మండలంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగలా జరుగుతున్నాయి. శ్రీదేవీ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడో రోజు శ్రీ మహాచండీదేవీగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



గుండెపుడిలో పూజలు చేస్తున్న భక్తులు

## క్లుప్తంగా

### గ్రూపు-2లో సత్తాచాటిన గ్రంథాలయ అభ్యర్థులు



వెంగళరావు



రమేష్

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెంలోని జిల్లా గ్రంథాలయంలో చదువుకుని పోటీ పరీక్షలు రాసిన పలువురు గ్రూప్–2 ఫలితాలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఉపేంద్ర ఎస్సై, భూక్యా రమేష్ సెక్రెటేరియట్ (ఏఎస్‌వో), వెంగళరావు ఎక్సైజ్ ఆఫీసర్ ఉద్యోగాలు సాధించారు. సంతోష్ డీఎస్సీ రాసి ఆంధ్రప్రదేశ్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం సంపాదించారు. వీరికి గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కార్యదర్శి కే.కరణకుమారి, గ్రంథపాలకురాలు మణిమృదుల వారికి ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు.

### సహపంక్తి భోజనాలు



భోజనాలు చేస్తున్న పోచారంతండా ప్రజలు

**ఇల్లెందురూరల్:** కుల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా మండలంలోని పోచారంతండా గ్రామంలో మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాస్‌లైన్ నేతలు చంద్ర అరుణ, నాయిని రాజు మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు విద్య, మానవ హక్కులు అందించి అంటరానితనం రూపుమాపేందుకు ప్రతీఒక్కరు కంకణబద్ధులు కావాలని కోరారు. అంబేడ్కర్, పూలే సిద్ధాంతాలకు అనుగుణంగా అన్నివర్గాల ప్రజలకు సమాన హక్కులు అందే వరకు మాస్‌లైన్ ఉద్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో బుర్ర రాఘవులు, ఆజ్మీర బిచ్చా, బోస్, వెంకన్న, శ్రీరాం కోటయ్య, సావిత్రి, బాబూలాల్, మహేందర్ తదతరులు పాల్గొన్నారు.

### జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేయాలి



మాట్లాడుతున్న భానుచందర్

**టేకులపల్లి:** జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ వార్డులు జనాభా ప్రాతిపదికన కాకుండా ఇష్టం వచ్చినట్లు రిజర్వేషన్ కల్పించడం గర్హనీయమన్నారు. దీని వెనక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పునఃపరిశీలించి డ్రా పద్ధతి కాకుండా పాత పద్ధతి ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలని లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని, సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తోటకూరి సతీష్‌కుమార్, కోడెం రవి, భూక్యా లక్ష్మణ్, జార్జి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### మరో విద్యుత్ కర్మాగారం నిర్మించాలి



మాట్లాడుతున్న శ్వేత

**పాల్వంచ:** గత పాలకులు ముందుచూపు లేకుండా పాల్వంచలోని కేటీపీఎస్ ఓఅండ్‌ఎం కర్మాగారాన్ని తొలగించారని, దానివల్ల తీరని అన్యాయం జరిగిందని చాకలి ఐలమ్మ మునిమనుమరాలు, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ కర్మాగారం తొలగించడం వల్ల వేలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారని, ఇప్పటికైనా ఇక్కడ మరో కర్మాగారాన్ని నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనికోసం కృషి చేస్తానన్నారు. పాల్వంచలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని, అదేవిధంగా చాకలి బజార్‌కు వీరనారి ఐలమ్మ బజార్‌గా నామకరణం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గందమల్ల చెన్నయ్య, బుర్గుల విజయభాస్కర్, ముదిగొండ సత్యనారాయణ, మడిపెద్ది వెంకటసోములు, ధర్మరాజుల నాగేశ్వరరావు, చెరుకు అశోక్, ప్రకాష్, చిట్యాల సోమయ్య, కందుకూరి శ్రీనివాస్, మధు, శ్రీకాంత్, ప్రశాంత్, సురేష్, నవతన్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ



ఇల్లెందు: మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ బాదావతి రవి

**ఇల్లెందు:** తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ సంబురాలను ఆయన తన సతీమణి లక్ష్మీతో కలిసి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆట కోసం లైటింగ్, సౌండ్ సిస్టమ్, కార్పెట్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ ఆట పూల పండుగ ఒక భాగమైందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ఆటపాటల ద్వారా తెలంగాణ నిండుతనం ఫరిఢవిల్లాలని ఆకాంక్షించారు. తొమ్మిదా రోజులు సాగే బతుకమ్మ పండుగను గ్రామగ్రామాన వైభవంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోచికొండ శ్రీదేవీ, గాడిపల్లి స్వరూప, నిర్మల, మడుగు వెంకట లక్ష్మి, కల్తి పద్మ, యదళ్లపల్లి అనసూర్య, మోకాళ్ల వెంకటమ్మ, పార్వతి, చెంచమ్మ, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, గందె సదానందం తదితరులు పాల్గొన్నారు.

**పోలీస్‌స్టేషన్‌లో..**

**జూలూరుపాడు:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దిశ ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాలకు ముఖ్యఅతిథిగా ఎస్‌ఐ బాదావత్ రవి హాజరయ్యారు. దిశ సభ్యులతో కలిసి ఆటపాటలతో బతుకమ్మ ఆడారు. మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. కార్యక్రమంలో దిశ ఉమెన్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు రేవతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు మాధవి, రాష్ట్ర కార్యదర్శి కొడెం సీతాకుమారి పాల్గొన్నారు.

## ఏరియాలో ఘనంగా బతుకమ్మ, ఫ్యామిలీ డే



ప్రగతివనంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**సింగరేణి(కొత్తగూడెం):** కొత్తగూడెం ఏరియాలో ఆదివారం ప్రగతివనంలో బతుకమ్మ, ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఫ్యామిలీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల మహిళలు బతుకమ్మ ఆడారు. ఏరియా సేవా అధ్యక్షురాలు మధురవాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం ఎం శాలేంరాజు హాజరయ్యారు. మాట్లాడుతూ సింగరేణి సంస్థ అన్ని మతాల పండుగలకు ప్రాధాన్యం కల్పిస్తుందని, స్పెషల్‌గా తెలంగాణలో జరిగే బతుకమ్మ వేడుకలకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు, సేవా సమితి సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ నేటి తరానికి స్ఫూర్తి

ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ 118వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దేశ ప్రజలలో ఉద్యమస్ఫూర్తిని రగిలించి స్వాతంత్ర్యోద్యమం వైపు నడిపించిన భగత్‌సింగ్ నేటి తరానికి ఆదర్శం అన్నారు. – సాక్షి నెట్‌వర్క్




సూపర్‌బజార్(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



టేకులపల్లిలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



జూలూరుపాడులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

### బతుకమ్మ ఘాట్ పరిశీలన

**సుజాతనగర్:** సుజాతనగర్ శివాలయం సమీపంలోని బతుకమ్మ ఘాట్‌ను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం నిమిత్తం బతుకమ్మలను తీసుకొచ్చే మహిళలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఘాట్ వద్ద లైటింగ్, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ ఆర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

### భవానీ మాలధారుల ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

**ఇల్లెందు:** దేవీ నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని జేకే బస్టాఫ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరిన దుర్గామాతకు భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హనుమాన్ చాలీషా పారాయణం ఆలకించారు. ఆదివారం సెలవుదినం కావడంతో స్థానిక భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

**జూలూరుపాడు:** ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యమని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సీపీఎం మండల మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యులు యాసా కొండలరావు నాలుగో వర్ధంతి సందర్భగా వారి స్తూపం వద్ద నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా కొండలరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండలరావు ప్రజా సమస్యల కోసం నిరంతరాయంగా పోరాటాలు నిర్వహించారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొండలరావు స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఎన్నో ఏళ్లుగా జూలూరుపాడులో వ్యవసాయ మార్కెట్ ఉండాలని పోరాటం చేసిన ఘనత సీపీఎం పార్టీదేనన్నారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, నందీప్, గడిదేశి కనకరత్నం, ఊడల వెంకటేశ్వర్లు, పద్దం సుగుణ, రెడ్డిబోయిన గోవిందు, వల్లమల్ల చందర్‌రావు, బానోత్ మధు, జల్లి రాధాకృష్ణ, మాళోత్ రాములు, ఇస్లావత్ భద్రు, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివారం జాక్‌పాట్..!


**ఇల్లెందురూరల్:** ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. ఈ రోజున ఏం చేసినా ఏ అధికారీ పట్టించుకోరు. దీన్ని ఆసరా చేసుకొని ప్రతీ ఆదివారం కొందరు మట్టి, ఇసుక దందా కొనసాగిస్తున్నారు. సెలవు రోజుల్లో మట్టి, ఇసుక లోడ్‌తో ట్రాక్టర్లు ప్రధాన రహదారులపై పరుగులు పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇదిలా ఉండగా మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరిట మట్టి రవాణా చేపట్టేందుకు ఎవరికీ.. ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ రవికుమార్ ఇటీవల స్పష్టం చేశారు. కానీ ప్రతీ వారం మాదిరిగానే ఈ ఆదివారం కూడా మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టనట్లుగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. సీఎస్పీ బస్తీ, మామిడిగుండాల ప్రాంతాలలో గుట్టలను తోడేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్ల సహాయంతో మట్టిని తరలించారు. ఓవర్ లోడ్‌తో ట్రాక్టర్లు పరుగులు పెట్టడంతో మామిడిగుండాల రహదారి సైతం ఛిద్రమైనట్లు స్థానికులు వాపోతున్నారు. ఇందిరమ్మ పేరిట మట్టి రవాణా సాగిస్తున్నా అది లబ్ధిదారులకు అదనపు భారంగా మారుతుండగా అక్రమార్కులకు మాత్రం కాసులు కురిపిస్తోంది. అధికారులు ఇప్పటికైనా మట్టి దందాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమంగా తరలిస్తున్న ఎర్రమట్టి

## వేతనంతో కూడిన సెలవు ప్రకటించండి..

**సింగరేణి(కొత్తగూడెం):** అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి, దసరా పండుగ ఒకేరోజు వచ్చినందున అక్టోబర్ 3న దసరా పండుగ జరుపుకొనేందుకు సింగరేణిలో వేతనంతో కూడిన సెలవుదినం ప్రకటించాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఈ విషయంలో యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణ సంప్రదాయంలో దసరాకు ఆడబిడ్డలు, అల్లుళ్లు, కొడుకులు, కూతుళ్లతో ఇంటిల్లిపాది జరుకునే అతిపెద్ద పండుగని, ఇదే రోజు అక్టోబర్ 2న గాంధీ జయంతి వచ్చినందున ఆరోజు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవహింస ఉండదని, దీంతో పండుగను ఆనందంగా జరుపుకోవడం వీలుకాదన్నారు. కోలిండియాలో అక్టోబర్ 2న దసరా, గాంధీ జయంతి వచ్చినందున వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లో అక్కడి ఉద్యోగులకు యాజమాన్యం అక్టోబర్ 3న సెలవుదినం ప్రకటించింది. కోలిండియా పరిధిలో నడుస్తున్న సింగరేణి సంస్థలో కూడా అక్టోబర్ 3న సెలవు ప్రకటించాలని, ఈ మేరకు సింగరేణి డైరెక్టర్(పా) గౌతంపోట్రుకు ఇటీవల నాయకులు వినతిపత్రం కూడ అందజేశారు. దీంతోపాటు సింగరేణి సంస్థ సింగరేణి డేకు, తెలంగాణ ఆవిర్భావం, స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డేలకు నిధులు కేటాయిస్తుంది. అదేవిధంగా దసరా వేడుకల్లో అంత్యంత ప్రాచుర్యం కలిగిన రామ్‌లీల వంటి కార్య క్రమాల నిర్వహణకు బడ్జెట్ కేటాయించాలని కోరారు.



సెలవుదినం మార్చాలని డైరెక్టర్(పా)కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

**తెలంగాణలో పెద్ద పండుగ..**



ఆనందంగా పండుగ జరుపుకునేందుకు యాజమాన్యం దసరా సెలవు అక్టోబర్ 3కు మారుస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయాలి. కోలిండియాలో ఇచ్చిన విధంగా సింగరేణిలో కూడా ఇవ్వాలి. వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లో రాఖీ పండగ పెద్దగా చేస్తున్నందున ఆ పండుగకు కంపెనీ సెలవుదినం ప్రకటించింది.

– వి.శ్రీనివాస్, సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి

**కోలిండియాలా అమలు చేయాలి...**



కోలిండియా ఎలా అమలు చేస్తుందో, సింగరేణిలో కూడా అదేవిధంగా అమలు చేయాలి. తెలంగాణలో అదిపెద్ద పండుగ దసరా. తెలంగాణలో అతిపెద్ద సంస్థ సింగరేణి కాబట్టి, కొన్ని సందర్భాలలో కార్మికుల మనోభావాలకు అనుగుణంగా సంస్థ నడుచుకోవాల్సి ఉంటుంది.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

**బడ్జెట్ కేటాయించాలి..**



సింగరేణి సంస్థ సింగరేణి డే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డేలకు నిధులు కేటాయిస్తుంది. అదే విధంగా దసరా వేడుకల్లో అంత్యంత ప్రాచుర్యం కలిగిన రామ్‌లీల వంటి కార్యక్రమాల నిర్వహణకు బడ్జెట్ కేటాయించాలి.

– నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ జనరల్ సెక్రటరీ

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148
కె. మధు - 97059 44416